# నిన్న - రేపు

-- Radhika Nori

"ఇప్పటిదాకా మీకోసం చూసి చూసి ఇప్పుడే వెళ్ళాడు మా అన్నయ్య" అంది సుభద్ర భోజనానికి కూర్చోబోతున్న భర్తతో.

"మళ్ళీ వస్తానన్నాడా? ఏమిటట విశేషాలు?" అన్నాడు భోజనం చేస్తూ విశ్వనాథం.

సుభద్ర ఏమీ మాట్లాడలేదు. భర్తకి అన్నీ వడ్డిస్తూ మౌనంగా ఆలోచిస్తోంది. అన్నయ్య మాటలు ఆమె చెవుల్లో గింగిర్లు ఎత్తుతున్నాయి. విశ్వనాథం కూడా ఏమీ అనలేదు. అతనికి తెలుసు, బావమరిది ఎందుకు వచ్చాడో, ఏం మాట్లాడాలనుకున్నాడో.

వంటింట్లో అన్నీ సవరించుకుని వచ్చింది సుభద్ర. విశ్వనాథం భోజనం ముగించి పడక కుర్చీలో కూర్చుని ఏవో కాగితాలు చూసుకుంటున్నాడు. సుభద్ర అడుగుల చప్పుడుకి మెల్లిగా తలెత్తి ఆమె వైపు చూసాడు.

"ఏమండీ! ఇప్పుడు మనం రాఘవ దగ్గరికి వెళ్ళే తీరాలా? అది సరైన నిర్ణయమేనా?" సందేహంగా అడిగింది సుభద్ర. ఆమె గొంతులో వినిపిస్తున్న భయాన్ని, అనుమానాన్ని విశ్వనాథం గమనించకపోలేదు. అసలు సుభద్ర ఇలాంటిదేదో అంటుందని అతను ముందునుండీ వూహిస్తూనే వున్నాడు. అతను అనుకున్న దానికంటే ఇంకా ఆలస్యంగానే అడిగింది సుభద్ర.

"సుభద్రా! వృద్ధాప్యంలో తల్లిదండ్రులు పిల్లల దగ్గర వుండటం చాలా సహజం. నీక్కూడా తెలుసు, దీంట్లో లోకవిరుద్ధమైన విషయం ఏదీ లేదని. అవునా? మరి దీంట్లో ఇంత అనుమానపడాల్సింది ఏముంది?" అన్నాడు అతను. ఏదో అన్నాడే కానీ తామున్న ప్రస్తుత పరిస్థితి మరీ అంత మామూలు విషయం కాదని, దీంట్లో ఇంతకంటే జటిలమైన ఇంకో సమస్య చిక్కుపడి వుందని అతనికి బాగా తెలుసు.

"ఎంత లోకసహజమైన విషయం అయినా వున్న వూరు విడిచిపెట్టి ఎంత సంతానమైనా ఇంకొకరి ఇంట్లో శాశ్వతంగా వుండాలంటే అది అంత తేలికైన విషయం అంటారా? అందులో ఇది ఈ వూరు వదిలేసి ఇంకో వూరు వెళ్ళటం లాంటి సామాన్యమైన విషయం కూడా కాదు. ఏకంగా దేశమే వదిలేసి వెళ్దామంటున్నారు మీరు. ఇది ఎంతదాకా సమంజసమో, ఎంతవరకూ అవసరమో ఆలోచించాల్సిన పని వుందా? లేదా?" కొంచెం విసుగ్గా అంది సుభద్ర.

"ఆ ఆలోచనలన్నీ అయిపోయాయి. ఇంతకు మించిన తర్జనభర్జనలన్నీ చేసేసాము మనిద్దరమూ. తీరా ఇప్పుడు టిక్కెట్లు కూడా వచ్చేసిన తర్వాత చివరి నిముషంలో ఈ పిరికి మాటలూ, సందేహాలూ ఏమిటి?" విసుగ్గా అన్నాడు విశ్వనాథం. సుభద్ర భయం అర్థం అయినా అవనట్లు నటించాడు.

"సుభద్రా! నువ్వు ఇంతదాకా అమెరికా వెళ్ళలేదు కాబట్టి ఆ దేశంలోని పద్ధతులూ అవీ నీకింకా తెలియదు. రెండేళ్ళ క్రితం మా అమ్మాయి పురిటికి నేను, మా ఆవిడ వెళ్ళి ఆరు నెలలు వుండి వచ్చాం కదా! అక్కడి జీవితం అదీ ఎలా వుంటుందో నాకు బాగా అర్థం అయింది. మాట్లాడదామంటే మనిషి దిక్కుండడు. పక్కింట్లో ఎవరుంటారో కూడా తెలీదు. అందరూ ఆఫీసులలో వుండే వేళ కర్మ చాలక మనకేదైనా అయితే పలికే నాధుడు కూడా వుండడు. అలాంటి చోట, ఎంత బావ వెంట వుంటే మాత్రం, నువ్వెలా వుండగలవు సుభద్రా!" అన్నయ్య మాటలు ఒక్కసారి గుర్తొచ్చాయి సుభద్రకి.

"అక్కడ అందరూ ఆఫీసులకి వెళ్ళిన తర్వాత ఒంటరిగా ఇంట్లో వుండాలంటే బిక్కు బిక్కు మని............" ఇంకా సుభద్ర ఏదో అనేలోపే, "నేను కూడా నీతోపాటే వుంటానుగా! ఒంటరితనం అంటావేమిటి?" అన్నాడు విశ్వనాథం. అతనికి తెలుసు, సుభద్ర ప్రస్తుత మానసిక స్థితి మీద వాళ్ళ అన్నయ్య మాటల ప్రభావం చాలా వుందని.

"వుంటారనుకోండి. అయినా అక్కడి పద్ధతులవీ వేరు. ఆ దేశ ఆచార వ్యవహారాలు వేరు. ఈ వయసులో మనం అక్కడికి వెళ్ళి ఆ దేశంలో, ఆ సమాజంలో ఇమడగలం అంటారా?" ఇంకా అనుమానం పోలేదు ఆమెకు.

"ఎందుకు ఇమడలేము? మనమేమీ అక్కడి బట్టలు వేసుకుని ఆ అమెరికనులతో పాటు డాన్సు చెయ్యక్కరలేదు. వాళ్ళ రాజ్యాంగం తెలుసుకుని అక్కడి రాజకీయాలలో పాల్గొనక్కరలేదు. ఏదో కాస్త ఇంటిపట్టున వుండి మనవళ్ళని చూసుకోవాలి. అప్పుడప్పుడు కొడుకు, కోడలితో పాటు పిల్లల్ని తీసుకుని పార్టీలకి, పెళ్ళిళ్ళకి, పూజలకి, స్నేహితుల ఇళ్ళకి ఇక్కడిలాగే వెళ్తూ వుండాలి. దీనికి ఇంత ఆలోచన, అన్ని సందేహాలు అనవసరం" అన్నాడు విశ్వనాథం.

"మీరు మగవారు. మీకేం? అలాగే చెప్తారు. కానీ అంత తేలికగా నాకెలా కుదురుతుంది? అసలు నాకు సుశీల గురించి, కోడలైనా సరే, పెద్దగా తెలియదు. పెళ్ళయిన తర్వాత ఇంతవరకూ ఆ అమ్మాయి ఇక్కడ చుట్టపుచూపుగా వుందే కానీ పర్మనెంటుగా ఎప్పుడూ ఇక్కడ లేదు. ఆ కొద్దిపాటి రోజుల్లో ఎవరైనా మంచిగానే వుంటారు. ఇప్పుడు మనం వెళ్ళి ఆ అమ్మాయి ఇంట్లో వుండాలంటే ఎలా వుంటుందోనన్న అనుమానంగా వుంది" అని తన మనసులో వున్న అనుమానాన్ని చెప్పేసింది సుభద్ర.

ఆవిడ అన్నట్లుగా ఇది అని చెప్పటానికేమీ చెడు లేకపోయినా సుశీల స్వభావం గురించి వాళ్ళకి అంతగా తెలియదు. పెళ్ళయిన వారం రోజులకి రాఘవ తనతో పాటే J2 visa మీద అమెరికా తీసుకెళ్ళిపోయాడు. ఆ తర్వాత అప్పుడప్పుడు ఇండియాకి వచ్చి వీళ్ళ దగ్గరున్న కాసిని రోజులూ మంచిగానే వుంటుంది. చుట్టాలు, స్నేహితులందరితోనూ బాగానే కలిసిపోయింది. మర్యాదలన్నీ బాగానే పాటిస్తుంది. "ఈ వయసులో మా దగ్గర పెద్ద దిక్కుగా వున్నట్లుగానూ వుంటుంది. మా పిల్లలకి తాత, నాయనమ్మల అండ వున్నట్లుగానూ వుంటుంది. మీకిక్కడ ఇంకేమీ బాధ్యతలు కూడా లేవు కదా! మాదగ్గర కొచ్చి వుండండి అత్తయ్యా!" అంటూ ఎంతో మర్యాదగా అడిగింది. తప్ప

పట్టటానికీ, ఇది అని ఎత్తి చూపించటానికి చెడు ఏదీ ఆ అమ్మాయిలో కనిపించదు. కానీ ఏమో! ఈ రోజుల్లో పిల్ల, ఇవన్నీ బయటికి కనిపించే బూటకాలేమో! మనకి తెలియని లోపలి స్వయంపాకం వేరే ఇంకేదో వుందేమో! తను ఇక్కడ వుండటం, తామిద్దరూ వాళ్ళింట్లో వుండటం ఒకటెలా అవుతాయి? ఇవన్నీ సుభద్ర ఆలోచనలు. ఈ ఆలోచనలన్నీ విశ్వనాథంకి ఆమె చెప్పకపోయినా తెలియనివి కావు. అయినా పైకి మాత్రం "సుభద్రా! అలాంటి భయాలేవీ పెట్టుకోకు. ఇంక ఇలా ప్రతీదానికీ సందేహిస్తే ఈ అనుమానాలకి అంతు వుండదు. ఇంతదాకా మంచిగా వుంది. ఇకముందు కూడా అలాగే మంచిగానే వుంటుంది అనుకో. అలా వుండదు అనుకోవటానికి ఆధారాలేమీ లేవు కూడా! అవునా? అసలు అలా అనుకుంటే ఎంతసేపూ పరాయి పిల్ల కదా అని కోడలిని సందేహిస్తున్నావు కానీ రాఘవ గురించి అనుమానపడవెందుకు? కోడలు పరాయిది, కొడుకు మాత్రం మన స్వంతం, మన అబ్బాయి అనా? ఈ పిచ్చి పిచ్చి అనుమానాలు మాని నా మాట విను. మంచి వాళ్ళకి అంతా మంచే జరుగుతుంది. ఆ దేవుడిని నమ్ముకో! కోడలైనా, కూతురైనా మనకి ఆ అమ్మాయి ఒక్కతే! ఎవరికైనా నోరు మంచిదయితే వూరు మంచిదవుతుంది. వాళ్ళు మనింట్లో వున్నా, మనం వాళ్ళింటికి వెళ్ళినా మన హద్దుల్లో మనం వున్నపుడే మన మర్యాద నిలుస్తుంది" అంటూ సుభద్రకి నచ్చచెప్పాడు.

భర్త ఎంత నచ్చచెప్పినా సుభద్ర అనుమానాలు, భయాలు ఆమెని వదిలిపోలేదు. కన్నబిడ్డలు సరిగ్గా చూడకపోవటం వలన కష్టాలు పడుతున్న తమ స్నేహితుల కన్నీటి గాధలు గుర్తొచ్చి ఆమె మనసు కలవర పడుతోంది. ఇంతవరకూ సుఖాన వున్న ప్రాణాన్ని ఉత్తపుణ్యానికి కష్టాల్లోకి తోసేస్తున్నామేమో అన్న సందేహం ఆమెని భయపెడుతోంది. దీనికి తోడు ఎప్పుడూ చూడని విదేశంలో జీవితం ఎలా వుంటుందో, అక్కడి వాతావరణంలో ఎంతవరకూ ఇమడగలమోనన్న భయం కూడా ఆమె మనసుని ఇంకొంచెం ఎక్కువ అశాంతిపాలు చేస్తోంది. ఆరేళ్ళ క్రితం రాఘవ అమెరికా వెళ్తానన్నపుడు వున్న ఒక్క కొడుకు దూరదేశాలు వెళ్తున్నాడు, వాడిని విడిచి ఎలా వుండగలదు అనుకొందే కానీ దాని వలన భవిష్యత్తులో తనిలాంటి చిక్కు సమస్యలో ఇరుక్కొంటుందని వూహించలేకపోయింది. ఒక్కగానొక్క కొడుకు, దూరాన వున్నా ఏదో తన జీవితం భర్త చేతిలో ముగుస్తుంది, అంతదాకా ఏదో క్రిష్ణా, రామా అనుకుంటూ తన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించగలిగితే అంతే చాలు అనుకొంది. కానీ ఆ బాధ్యతలో భాగంగా ఇప్పుడు స్వంత దేశం, వున్న వూరు అన్నిటినీ వదిలేసే అవసరం వస్తుందని కలలో కూడా అనుకోలేదు. అయినా అసలు అమెరికాలో తనెలా వుండగలుగుతుంది? అక్కడేమో ఇంగ్లీషు మాట్లాడటం రాకపోయినా, కారు నడపటం రాకపోయినా చాలా కష్టం అని అన్నయ్య చెప్పాడు. మరి తనకేమో ఏదో మామూలుగా అనే sorry, thank you లు తప్ప వేరే ఇంగ్లీషేదీ రాదు. దానివలన ఇంక వేరే వాళ్ళతో మాట్లాడటానికే వుండదేమో! మౌనంగా మూగదానిలాగా వుండాలి కాబోలు. ఇంక కారు నడపటం తనకీ, ఆయనకీ కూడా రాదు కాబట్టి ప్రతీదానికీ ఇతరుల మీద ఆధారపడాలి కాబోలు. కాళ్ళు కట్టేసినట్లు అస్తమానూ ఇంట్లోనే కూర్చుంటూ అన్నయ్య అన్నట్లుగా ఒకటో క్లాసు జైలు జీవితం గడపాలి కాబోలు. ఈ వృద్ధాప్యంలో ఇలా స్వేచ్ఛ లేని జీవితాన్ని గడపమని రాసాడు కాబోలు తన నుదుట ఆ దేవుడు!

ఇలాంటి ఆలోచనలు ఈగల్లాగా ముసురుకొంటున్నాయి సుభద్రను.

"సుభద్రా! అనవసర ఆలోచనలతో మనసు పాడు చేసుకుని Blood pressure పెంచుకోకు. మీ అన్నయ్య లాంటి వాళ్ళ మాటలను పట్టించుకోవద్దు. ఎవరు ఏమన్నా మన కుటుంబ పరిస్థితి, మన అవసరాలు, మన బాధ్యతలు మనవి. వాటిని బట్టి మనం నిర్ణయాలు తీసుకోవాలి. ఇతరుల సలహాల బట్టి కాదు. ఎవరికి తోచినది వారు చెప్తారు. మన పరిస్థితి వారికేం తెలుస్తుంది? ఎదుటివారికి వుచిత సలహాలు చెప్పటం అన్నిటికంటే తేలికైన పని. వారిదాకా వస్తే మాత్రం అప్పుడు ఇంకో రకంగా ప్రవర్తిస్తారు. మీ అన్నయ్య మాత్రం, ఇప్పుడిలాంటి సలహాలు చెప్తున్నాడు. గుర్తుందా? ఆరేళ్ళ క్రితం రాఘవ మొదటిసారిగా అమెరికా వెళ్తున్నపుడు ఎంత హంగామాలు చేసాడో? ఒక్కగానొక్క కొడుకు, కడ జీవితంలో తల కొరివి పెట్టవలసినవాడిని ఏడు సముద్రాల అవతలికి విసిరేస్తున్నావు ఎందుకు, ఒకసారి అమెరికా వెళ్ళిన తర్వాత మీరు రమ్మన్నా మాత్రం మళ్ళీ తిరిగి వస్తాడా అంటూ తెగ గొడవ పెట్టాడు. మళ్ళీ కొడుకులకి ప్రేమలుండవు, కూతుళ్ళకే ప్రేమలుంటాయి అంటాడు. మరి ఇన్ని కబుర్లు చెప్పే మనిషి వున్న ఒక్క కూతురినీ అల్లారుముద్దుగా పెంచుకుని మళ్ళీ అమెరికా సంబంధానికి ఎందుకు చేసాడు? తను వేరేవారికి చెప్పే సలహాలు స్వయానా తనకి వర్తించవా? ఏమన్నా అంటే మంచి సంబంధం అంటాడు. ఇలాగే అందరూ తమకి నచ్చిన కారణాలకి, తమ convenience ప్రకారం ప్రతీ రూల్ నీ తమకు నచ్చిన రీతిలో relax చేసేసుకుంటారు. ఇతరులకి మాత్రం నీతిబోధలు వల్లిస్తారు. ఆ తేడా మనమే గమనించాలి. నీ బుర్ర వుపయోగించి ఆలోచించు సుభద్రా! రాఘవ మనకి ఒక్కగానొక్క కొడుకు. అల్లారు ముద్దుగా పెంచుకున్నాం. కానీ మన స్వార్థం కోసం మనకి తల కొరివి పెట్టడానికి వుండాలనో, వృద్ధ్యాప్యంలో మనకి అండగా వుండాలనో, మన స్వలాభం కోసం వాడి భవిష్యత్తుని ఆటంకపరిచి, జీవితంలో పైకి వెళ్ళనివ్వకుండా అడ్డుపడి, అరుదుగా వచ్చే అవకాశాలు వాడికి వస్తే వాటిని వుపయోగించుకోనీయకుండా అడ్డుపుల్లలు వేయటం ఏం సమంజసం? అందుకే మీ అన్నయ్య లాంటి వాళ్ళ మాటలని లెక్క చేయకుండా ఆనాడు వాడిని అమెరికా పంపించాను. అక్కడికి వెళ్ళినందుకు వాడు కూడా అక్కడి అవకాశాలను బాగా వుపయోగించుకుని జీవితంలో బాగా పైకి వచ్చాడు. చిన్న వయసులోనే PhD పూర్తి చేసి ఇవాళ వాడు అమెరికాలో ఒక పెద్ద యూనివర్సిటీలో పేరున్న ప్రొఫెసరు. బోలెడంతమంది PhDలను తయారు చేసాడు, చేస్తున్నాడు. మన అదృష్టం బాగుండి కోడలు కూడా మంచి పిల్ల. చదువుకున్నది. గుణవంతురాలు. లవకుశుల్లాంటి ఇద్దరు మనవలు.

ఇంతకంటే ఏ తల్లితండ్రులకైనా ఇంకేం కావాలి సుభద్రా! ఈ చరమ దశలో మనకు ఇంకేం అక్కరలేదు. ఎక్కడున్నా గడచిపోతుంది. కానీ రాఘువ, పాపం, నోరు విప్పి అడిగాడు, మనల్ని అక్కడికొచ్చి వుండమని, తనకి కాస్త సహాయంగా వుంటుందని. వాడి కోరికని తీరిస్తే, కనీసం తీర్చటానికి ప్రయత్నిస్తే ఏం నష్టం మనకి? స్వంత కొడుకు, వాడి అవసరాలు, కోరికల కంటే వేరేవారి మాటలు, అర్థం పర్థం లేని నీ భయాలు ఎక్కువా నీకు? నిజమో, కాదో తెలియని విషయాల గురించి అనవసరంగా ఆలోచించి, అవుతాయో, అవవో తెలియని సంఘటనలని అధికంగా వూహించి మనసు పాడు చేసుకోకు. అసలు ఏ విషయాన్నయినా negative గా కాకుండా positive గా చూడటం నేర్చుకో. అపుడు జరగని అసంభవాలు కూడా ఏదో అజ్ఞాత శక్తుల వల్ల సంభవమయ్యే అవకాశం వుంది. సరే, ఇంక పద. కాలాన్ని ఇలా అనవసరంగా వృధా చేయకుండా మనం ఇంకా చేయాల్సిన పనుల గురించి ఆలోచించు. ఆ చెట్లూ అవీ చూసుకోడానికి, రోజు నీళ్ళు పోయటానికి ఎవరినో మాట్లాడతానన్నావు. మాట్లాడావా? ఎవరన్నా కుదిరారా?" మెల్లిగా నచ్చచెపుతున్నట్లు చెప్పదల్చుకున్నవన్నీ చెప్తూ తమ బాధ్యతను గుర్తు చేసాడు విశ్వనాథం.

భర్త మాటలు విన్న తర్వాత కొంచెం రిలీఫ్ గా అనిపించింది సుభద్రకు. 'నిజమే! ఆరేళ్ళ క్రితం రాఘువ PhD కోసం అమెరికా వెళ్ళబోయేటప్పుడు కూడా అన్నయ్య ఇలాగే గొడవ చేసాడు. వున్న ఇక్క నలుసునీ దూరం చేసుకుంటున్నారు అన్నాడు. అమెరికాలో చెడు అలవాట్లకి లొంగిపోతాడు అన్నాడు. పెళ్ళి విషయంలో మీ మాట వినక మిమ్మల్ని ఏడిపిస్తాడు అన్నాడు. కానీ ఇవేమీ జరగలేదు. ఏమాట కామాటే చెప్పాలి. రాఘువ అప్పటికీ ఇప్పటికీ ఏమీ మారలేదు. ప్రతీ వారం ఫోను చేసి కనీసం అరగంటన్నా మాట్లాడతాడు. చెడు అలవాట్ల మాట కొస్తే తమ వెనకాల ఏం చేస్తున్నాడో తమకు తెలియదు కానీ తాము చూస్తూండగా మాత్రం కనీసం సిగరెట్టన్నా ముట్టడు. ఇంక పెళ్ళి విషయానికొస్తే అమెరికా వెళ్ళేముందు మాట ఇచ్చిన ప్రకారం PhD అయిపోయే ముందు వుద్యోగం రెడీగా పెట్టుకుని, ఇండియాకి వచ్చి, ఇక్కడ తాము చూసిన సంబంధాలలో తమకి నచ్చి, తాము మెచ్చిన సుశీల మెళ్ళోనే తాళి కట్టాడు. ఆ తర్వాత కూడా ఏమీ మారలేదు. ఇప్పుడు ఫోను చేసినప్పుడల్లా వాడితోపాటు సుశీల కూడా మాట్లాడుతుంది. ఇంతదాకా ఇంత ప్రేమగా వున్నవాళ్ళు అకస్మాత్తుగా కేవలం తాము వారితో కలిసి జీవించటానికి వారి దగ్గరికి వెళ్ళటం వల్ల ఎందుకు మారతారు? అన్నీ తన భయాలే! తాడుని చూసి పాము అని, నీడలని చూసి నిజాలని తను వుత్తగా భయపడుతోంది. భర్త అన్నట్లుగా తనకీ మధ్య అనవసర భయాలు ఎక్కువయ్యాయి' ఇలా ఆలోచించటానికి ప్రయత్నిస్తోంది సుభద్ర. 'అనుక్షణం భర్త అండదండలు తనకుండగా అసలు ఇన్ని ఆలోచనలు, అనుమానాలు తనకి ఎందుకు? అసలు ఎవ్వరి మాటలు తను పట్టించుకోకూడదు' అనుకుంటూ తనని తనే తరుచుగా మందలించుకుంటోంది. అయినా అప్పుడప్పుడు మనసు భయాందోళనలలో మునిగిపోవటం మానలేదు. అలాంటప్పుడు తనకి తనే ధైర్యం చెప్పుకోవటానికి ప్రయత్నిస్తోంది. ఇలా అటూ ఇటూ కాని సందిగ్ధంలో వూగిసలాడుతోంది ఆమె మనసు.

విశ్వనాథంకి కూడా బావమరదితో పాటు బయటివాళ్ళ మాటలు అప్పుడప్పుడు గుర్తొస్తూ వుంటాయి. "కొడుకు దగ్గర వుండటానికి ఎప్పుడైతే ఏం, ఎక్కడైతే ఏం, ఏ దేశమైతే ఏం" తటస్థంగా ఏమీ పట్టనట్లుగా అనేవారు కొందరు. "చిన్న వయసులో చదువులకీ, వుద్యోగాలకీ అందరూ అమెరికా వెళితే విశ్వనాథంగారు ముసలి వయసులో విదేశాలకి వెళ్ళి ఇంకో కొత్త adventurous జీవితం మొదలెట్టబోతున్నారు" వేళాకోళమో, నిజమో తెలియకుండా తమాషాగా అనేవారు కొందరు. "మెల్లిగా రాఘువ చేత greencard కి అప్లై చేయించుకుని మీరు కూడా ఏదన్నా job మొదలెట్టండి. డాలర్ల సంపాదనకి వయసుతో సంబంధం ఏముంది?" తమ భవిష్యత్తు గురించి తమ కంటే వాళ్ళే ముందుగా ప్లాను చేసేసి indirect గా ఈర్ష్య వ్యక్తం చేసేవారు కొందరు. "అక్కడ చలీ గిలీ తట్టుకోవటానికి యవ్వనం కాదిది, వృద్ధాప్యం విశ్వనాథం గారూ! గుర్తుంచుకోండి" అని హెచ్చరించేవారు కొందరు. "ఇన్నాళ్ళూ సంసార బాధ్యతలలో శ్రమ పడ్డారు. తీరా ఇప్పుడు రామా క్రిష్ణా అంటూ విశ్రాంతి తీసుకోవలసిన సమయంలో మళ్ళీ ఇప్పుడు మనవల బాధ్యత నెత్తి మీద వేసుకుంటున్నారా?" జాలో, తమ సుఖాన్ని గురించిన నిజమైన ఆందోళనో వ్యక్తం చేసేవారు కొందరు. "తమ దగ్గర వుండటానికి కొడుకు, కోడలు రమ్మన్నారని మురిసిపోతున్నారా విశ్వనాథంగారూ! ఇది మీమీద ప్రేమో, లేక ఇద్దరూ ఉద్యోగాలకి వెళ్ళిన తర్వాత వాళ్ళ పిల్లలని చూసుకోవటానికి best babysitters దొరుకుతున్నారన్న స్వార్థమో ఆలోచించారా? పైకి ఒప్పుకోరు కానీ ఆ దేశంలో మన స్థానం ఉత్త glorified babysitters మాత్రమేనండీ!" అనుమానపు బీజాలు నాటటానికి తెలివిగా ప్రయత్నించేవారు కొందరు. "అమెరికాలో జీవితం అంటే అంత తేలిక కాదు విశ్వనాథంగారూ! వూహించటానికి చాలా glamorous గా కనిపిస్తుంది కానీ చాలా tough life. అందులోనూ ఓపిక వుడిగిన వయసులో వెళ్తున్నారు మీరు. మన పనులన్నీ మనమే చేసుకోవాలి. ఇక్కడలాగా స్వేచ్ఛగా ఇష్టమొచ్చిన చోటికి ఇష్టమైనప్పుడు వెళ్ళటానికి వుండదు. ఎవరో ఒకరు మనల్ని తీసికెళ్ళేదాకా కాచుకుని వుండాలి. ప్రతీ పైసా ఖర్చుకీ ఇతరుల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడాలి. ఇవన్నీ కాక మన కర్మకొద్దీ ఏ రోగమో వచ్చిందంటే ఇంక ఆ medical insurance ల మాయాజాలం అంతా ఇంతా కాదు. పైగా ఇక్కడంటే డబ్బు పడేస్తే సేవలు చేయటానికి ఎవరో ఒకరు మనుషులు దొరుకుతారు. అక్కడెవరు చూస్తారు? ఏ

nursing home లోనో old age home లోనో పడేస్తే మాట్లాడే నాథుడు కూడా వుండడు. ఎందుకు సుఖాన వున్న ప్రాణాన్ని కష్టాల్లోకి తోసుకుంటున్నారు?" అంటూ భయపెట్టేవారు కొందరు.

ఈ హెచ్చరికలు, బెదిరింపులు, భయాలకి ఏమాత్రం జంకకూడదని గట్టిగా నిర్ణయించుకున్నాడు విశ్వనాథం. 'పూర్వం రోజుల్లో అయితే

Indians అక్కడ తక్కువగా వుండేవారు. కానీ ఇప్పుడలా కాదు. బోలెడంతమంది మనవాళ్ళు వున్నారక్కడ. ఒక చిన్న India ని సృష్టించారు అమెరికాలో. అందులో రాఘవ వుండేది పెద్ద సిటీ కాబట్టి Indians కి కరువేమీ లేదు. పైగా ఆ వూళ్ళో రెండు, మూడు పెద్ద కోవెలలు కూడా వున్నాయిట. మనవలని చూసుకోవటంతోపాటు తను, సుభద్ర తమ శక్తి మేరకు ఆ గుడి activities లో involve అవచ్చు. అసలు గుడి నిర్వహణకు సంబంధించి, దైవసేవ, పూజలకి సంబంధించి అనేక పనులు వుంటాయి. ఆ బాధ్యతలన్నిటిలోనూ చేతనైనంతవరకూ పాల్గొనవచ్చు. ఇటు సమాజసేవ విషయానికొస్తే పిల్లలకు తెలుగు నేర్పచ్చు. తనకి తెలిసినంతలో spiritual lectures ఇవ్వచ్చు. కొత్తగా పెళ్ళయి ఆ దేశానికి వచ్చిన ఆడపిల్లలకి సుభద్ర మన వంట వార్పులు నేర్పచ్చు. తమ మనవలతోపాటు ఇంకొంతమంది చిన్న పిల్లలని కూడా చూసుకుంటూ working mothers కి సహాయం చెయ్యచ్చు. ఇలా మనకంటూ ఒక routine ఏర్పరుచుకుని మన స్వంత పనితో పాటు కొద్దో గొప్పో సమాజ సేవ కూడా చెయ్యచ్చు. చేతనైనంత వరకూ ఇహపరాలు రెండూ దక్కుతాయి. ఇంక ఓపిక సంగతా, ఆ భగవంతుడు ఆరోగ్య భాగ్యాన్ని ఇవ్వాలే కానీ ఎంత active గా వుంటే అంత ఓపిక, శక్తి ఎక్కువవుతాయి. సోమరిగా వుండే శరీరానికి, మనసుకి వృద్ధాప్యం కానీ active గా వుండేవారికి కాదు. ఇంక డబ్బు మాట వస్తే తనకి రాఘవ ముందే చెప్పేసాడు "నాన్నా! ఈ వయసులో మిమ్మల్ని వేరేవారి దగ్గర, నా దగ్గరైనా సరే, చేయి చాచేట్లు చేయను. మీకు, అమ్మకు విడిగా కొంత డబ్బు bank లో deposit చేసాను. అది మీ ఇష్టం వచ్చినట్లు వాడుకోండి" అని ముందే చెప్పాడు. పాపం, రాఘవకి తమ ఆత్మాభిమానాన్ని గౌరవించాలని చాలా తాపత్రయం. ఇంక medical insurance ల విషయానికొస్తే మాత్రం, పాపం, అది వాడికి ఇంక తప్పదు. కానీ మరి రాఘవేమో ప్రొఫెసరు. సుశీల కాబోయే డాక్టరు. మరి ఈ ఖర్చులన్నీ భరించే శక్తి వారికి వున్నట్లుగానే రాఘవ చెప్పాడు. అబద్ధం చెప్పాల్సిన అవసరం వాడికి ఏముంది? ఇంక nursing home, old age home ల విషయానికొస్తే సంతానం సరిగ్గా చూడని ఎంతమంది తల్లిదండ్రులు ఇక్కడ మాత్రం nursing home లలో లేరు? వున్న ఒక్క కొడుకు, కోడలుకి దూరంగా ఇక్కడ తామిద్దరూ అనారోగ్యం పాలైతే ఎవరో పరాయివారు సేవలు చేయాల్సిందేగా! దాని బదులు తమ స్వంతవారి దగ్గర convenience కోసం nursing home లో అయితే మాత్రం నష్టం ఏముంది? ఇంక babysitting సంగతికొస్తే ఏ విషయం అయినా మనం ఏ రంగు కళ్ళద్దాలతో చూస్తే ఆ రంగులో కనిపిస్తుంది. రాఘవ, సుశీల అమెరికాలో కాకుండా ఇండియాలోనే, తమ దగ్గరే వుండివుంటే ఇంట్లో తామిద్దరూ మరి వాళ్ళ పిల్లల్ని చూసుకోరా? మరి అది babysitting కాదా? అమెరికాలో కాబట్టి అది వేలు పెట్టి చూపించే విషయం అయిందా? అసలు మన స్వంత పిల్లల్ని మనం babysitting చేస్తే మాత్రం తప్పేముంది? రాఘవ చెప్పాడు, వాళ్ళది పెద్ద సిటీ అవటం మూలాన తమ వయసువాళ్ళు, ఇలాగే, ఏదో ఒక కారణం వలన సంతానం దగ్గరికి వచ్చిన వాళ్ళు చాలామందే అక్కడ వున్నారట. కనుక వారందరితో కాలక్షేపానికి కొదవేమీ వుండదు. అసలు ఈ వయసులో కూడా తమవారికీ, పరాయివారికీ కూడా వుపయోగపడే అవకాశాన్ని ఇలా ఇస్తున్నందుకు ఆ దేవుడికి కృతజ్ఞతలు చెప్పుకోవాలి. ఇలాగే తమ శరీరంలో వూపిరి వున్నంత వరకూ తమ పనులు తాము చేసుకుంటూ, పదిమందికీ చేతనయినంత వరకు సహాయపడగల శక్తి సామర్థ్యాలు ఇవ్వమని ఆ భగవంతుడిని ప్రార్థించాలి. ఏమీ కారణం లేకుండా దేవుడు ఏదీ చేయడు. అసలు మన సంస్కృతి లో కుటుంబ సభ్యులందరూ వీలైనంత వరకూ కలిసి బ్రతకటం మన సంప్రదాయం. ఒకరికి ఒకరు అండగా, సహాయంగా వుండటానికి వృద్ధాప్యంలో తల్లిదండ్రుల దగ్గరికి పిల్లలు వచ్చినా సరే, లేక పిల్లల దగ్గరికి తల్లిదండ్రులు వెళ్ళినా సరే, తేడా ఏముంది? ఎందుకుండాలి? మరి ఇంత మామూలు విషయాన్ని అందరూ ఇలా భూతద్దం లోంచి ఎందుకు చూస్తున్నారు? కేవలం తాము వేరే దేశం వెళ్తున్నందుకా? ఇదే ఇండియాలోనే వేరే వూరు అయితే మరీ ఇంత విడ్డూరంగా అందరికీ కనిపించేది కాదేమో! ఏమో! తమ ఈ అమెరికా ప్రయాణం దేవుడు ఎందుకు సంకల్పించాడో! దీని వెనుక ఏం ప్రయోజనం దాగి వున్నదో! ఆ నటనసూత్రధారి తమ చేత ఇంకా ఏఏ పనులు చేయించదలుచుకున్నాడో! ఇవన్నీ మనకి తెలియని విషయాలు. సమాధానం దొరకని ఈ ప్రశ్నలని ఆ భగవంతునికే వదిలేస్తే మంచిది కదూ! సుభద్రకి మళ్ళీ ఇంకోసారి చెప్పాలి. అనవసరమైన భయాందోళనలతో మనసు అశాంతి పాలు చేసుకోవద్దని. సుశీల దగ్గర జీవితం ఎలా గడుస్తుందోనని, పాపం, భయపడుతోంది. మన హద్దుల్లో మనం వుంటే ఎవరి దగ్గరైనా సమస్య ఏం వుంటుంది? మర్యాదస్తుల పిల్ల, చదువుకున్నది, తెలివైనది, ఇన్నాళ్ళూ తమంటే గౌరవంగానే వుంది. ఇప్పుడు తమని హఠాత్తుగా, అలుసుగా, అమర్యాదగా ఎందుకు చూస్తుంది? చూడాల్సిన అవసరం ఏముంది? పోనీ అంతగా ఏ కారణం వలనైనా అక్కడ తమకి నచ్చకపోతే వెంటనే తిరిగి వచ్చేయవచ్చు. ఆ choice తమకి ఎప్పుడూ వుంటుంది. ఇక్కడ ఇల్లు కూడా అందుకే అమ్మకుండా వుంచుకుంటున్నారు కదా! భవిష్యత్తులో ఏదో చెడు జరుగుతుందేమోనన్న భయంతో ఇప్పటి వర్తమానంలో అసలే పనీ చేయనంటే ఎలా? అసలు ఆధ్యాత్మికంగా ఆలోచించే వారికి మనం ఏం చేస్తున్నా ఆ పైవాడే మన చేత నడిపిస్తూ అలా చేయిస్తున్నాడన్న ఆలోచనే తప్ప వేరు ఆలోచనే వుండదు. మన కర్తవ్యం చేయటం వరకే మన వంతు. దాని ఫలితాలు, ఆ తర్వాత దాని ప్రభావాలు మన చేతిలో లేవు. మనం కేవలం నిమిత్తమాత్రులం మాత్రమే! మనదేం వుంది? అంతా ఆ పైవాడి చేతిలో వుంది. ఈ జీవిత చరమాంకంలో ఇలాంటి వేదాంత ధోరణి అలవరుచుకోవటం ప్రతీవారికీ చాలా అవసరం'

ఇలా ఆలోచిస్తూ తమ జీవితంలో మొదలవబోతున్న ఇంకో నూతన అధ్యాయానికి నాంది పలకటానికి సిద్ధమవుతున్నాడు విశ్వనాథం.

***